# 6th Meeting of the BRICS Counter Terrorism Working Group

July 30, 2021

## బ్రిక్స్ ఉగ్రవాద నిరోధక వర్కింగ్ గ్రూప్ 6వ సమావేశం

జులై 30, 2021

భారత్ సారథ్యంలో బ్రిక్స్ ఉగ్రవాద నిరోధక వర్కింగ్ గ్రూప్ (సీటీడబ్ల్యూజీ) 6వ సమావేశం 2021 జులై 28-29 తేదీల్లో వర్చువల్‌గా జరిగింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో భాగమైన ఉగ్రవాద నిరోధక విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీ మహావీర్ సింఘ్వి దీనికి నేతృత్వం వహించారు. అన్ని బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) కూటమి దేశాల్లోని ఉగ్రవాద నిరోధక విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బ్రిక్స్ నేతలు 2020లో ఆమోదించిన బ్రిక్స్ ఉగ్రవాద నిరోధక వ్యూహం అమలుకు సంబంధించిన నిర్దిష్ట చర్యలను పొందుపర్చిన బ్రిక్స్ ఉగ్రవాద నిరోధక కార్యాచరణ ప్రణాళికను వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఖరారు చేశారు. ఉగ్రవాదం, విప్లవాత్మక ధోరణులు, ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చడం, ఇంటర్నెట్‌ను ఉగ్రవాదులు దుర్వినియోగం చేయడం వంటి వాటికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం, ఉగ్రవాదుల ప్రయాణాలపై ఆంక్షలు విధించడం, సరిహద్దుల్లో గస్తీ, దాడులకు ఆస్కారమున్న లక్ష్యాలను పరిరక్షించుకోవడం, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, సామర్థ్యాలను నిర్మించుకోవడం, అంతర్జాతీయంగా అలాగే ప్రాంతీయంగా పరస్పరం సహకారం అందించుకోవడానికి సంబంధించి బ్రిక్స్ దేశాల మధ్య ఫలితాల ఆధారిత సహకారాన్ని మరింతగా పటిష్ఠం చేసుకునే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడింది.

భారత్ సారథ్యంలో నిర్వహించిన బ్రిక్స్ సదస్సులో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాల్లో బ్రిక్స్ ఉగ్రవాద నిరోధక కార్యాచరణ ప్రణాళిక కూడా ఒకటి. వచ్చే నెలలో నిర్వహించ తలపెట్టిన బ్రిక్స్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో దీన్ని ఆమోదించనున్నారు.

ఉగ్రవాద కార్యకలాపాలు ఎక్కడ, ఏ విధంగా, ఎవరు చేసినా ఖండించాల్సిందేనని వర్కింగ్ గ్రూప్ సమావేశంలో బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. అలాగే జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాద ముప్పులను పసిగట్టడంపై అభిప్రాయాలను పంచుకున్నాయి. కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా తీర్మానించాయి.

ఉగ్రవాద నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశం జరగడానికి ముందు ఉగ్రవాద కార్యకలాపాల కోసం ఇంటర్నెట్‌ను దుర్వినియోగం చేయడం, తీవ్రవాద ధోరణులను తగ్గించడం, ఉగ్రవాద కార్యకలాపాలకు నిధుల అందకుండా చేయడం, సామర్థ్యాలు నిర్మించుకోవడం, విదేశీ ఉగ్రవాదులను ఎదుర్కొనడం వంటి అయిదు అంశాలపై 2021 జులై 26-27 తేదీల్లో ఉప వర్కింగ్ గ్రూప్‌లకు చెందిన వర్చువల్ సమావేశాలు జరిగాయి.

**న్యూఢిల్లీ**

**జులై 30, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.